

# ఏడడుగుల కింద...

# SPECIAL STORY OF THE WEEK

అంతా వెళ్లిపోయారు...

ఇంట్లో ఎంతటి స్మశాన స్తబ్దత...? అంతా నీ పెళ్ళికే వచ్చారు.

ఎక్కడో దూరాన నువ్వు... బాజాభజం త్రీల మధ్య... అయిన వాళ్ళందరిని సంతోష కెరటాల మధ్య... వూహిస్తేనే గుండె మం చుకుంపటవుతోంది.

ఏ జ్ఞాపకం... మెదడు పొరల్లో విస్ఫోటనం! నువ్వు విడిచి పెట్టిపోయిన నిశ్శబ్దం రెక్కలు సాచి టపటపా కొట్టుకుంది. అవంతమైన ఘడియల్లో ఒక్క క్షణమైనా గుర్తొస్తానా? ఏమో? వ్యాయం కిందికి వెళ్ళిపోయావు నువ్వు. నన్ను 'అన్యాయం' చేపి! నువ్వు ఎంగిలి చేసిన ఒంటరితనాన్ని ఎన్నాళ్ళు కొరుక్కు తివమ???

గుండె గదుల్లో ప్లాస్టర్ చేసిన ఆత్మ విమర్శను తొలుచుకుంటూ మన్నుతిన్న పాపలా... నేని గది లో. నీ జ్ఞాపకాల్లో వేళ్లుపెట్టి కెలుకుతున్నాను. కాలి వేలితో నీ నేలగీతలకు లిపిని వెదుకుతున్నా... ఆ నేలకూ.... నీ వేలికీ మధ్యపడి చితికిపోయిన నా గుండెను నేనే స్పర్శిస్తున్నా... అంతా తడి!! నువ్వనే దానివి—వానపాములూ కాటేస్తాయని... నిజం... నువ్వేసిన కాటుకి మెదడు మొద్దుబారు తోంది.

## PROCESSION

చూడు....

వాళ్ళందరూ మూకుమ్మడిగా వచ్చి వెన్నెల్లో కట్టుకున్న ఇసుకగూళ్లను ఎలా పాడుచేసిపోయా రో? ఓ 'నైటింగేల్' వచ్చి కూస్తుందక్కడ. ఆశ్చ ర్యం... దాని రెక్కల్ని ఎవరో నరుక్కుపోయారు! దాని చుట్టూరా వాళ్ల నవ్వుతున్నారు... గిల్లుకుం టున్నారు... ఏడుస్తున్నారు... గోళ్లతో రక్కుతు న్నారు... తలకాయల్ని భూమిలో పాతేసి బిగ్గరగా పాడుతున్నారు... ఆకాశంలోంచి రాలిపడ్తున్న టపా కాయల్ని నోళ్ల తెరచి మింగుతున్నారు... కొమ్ము లు... కోరలు... విషగ్రంధులు పగిలి సొన ప్రవ హిస్తోంది...

పడుకున్నప్పుడు ప్రశ్నార్ధకంలా... నిల్చున్నపు డు ఆశ్చర్యార్ధకంలా తోచేదానివి. నువ్వెప్పుడు నన్ను సమాధానపర్చావని....? మనసులో జరుగుతున్న బ్లాస్టింగులకు నాకూ రోధించాలని వుంది. (రోద నం మానవానాం బలం) కానీ నువ్వు చెప్పేదాని వే...

కె.వి.నరేందర్



# "HAPPYNESS IS THE EVERYDAY SUNSHINE"

**"గుండె గదుల్లో కన్నీళ్లు మురిగిపోయి బాధ దుర్భరమేసినా...**
**ఏడ్చిన వాడు మనిషి... కంఠంలో కప్పి పుచ్చుకున్నవాడు మహర్షి'' అని.**

ఏ ఋషిత్వాన్ని ఆపాదించాలని చూశావో... ఏ రాక్షసుణ్ని ని(దపుచ్చాలని చూశావో నాకే అర్థం గాదు. అదుగో... Happyness is the every day Sunshine of Your life నువ్వు పంపిన గ్రీటింగులోని సూర్యుడు చెదలు పురుగు గర్భంలో పురుడు పోసుకొంటున్నాడు.

## FLASH


గది పైకప్పు సూర్యకిరణాన్ని ఆవిష్కరిస్తోంది. కెమెరా, వీడియోల గర్భాల్లో నువ్వు చుట్టుకుపోతుండొచ్చు. ఎవరో ఒకాయన... తెల్లజెర్రులూ... పాముల్ని పంచిపెడ్తున్నాడు. నీవైపు విసిరెయ్యాలని వాళ్ల కళ్ళల్లో ఎంతటి కసి... నువ్వేమో పారిపోవు!

ఎప్పుడూ ఏకాంతంలో (వేళ్ల లెక్కిస్తూ కూచునే దానివి... ఏమిటీ అంటే?

అరుంధతి ఒకటి.
మనసులు రెండు..
ముడులు మూడు...
అడుగులు ఏడు.......
బంధువులు వందలు
...............
లాంచనాలు లక్షలు
కట్నం కోట్లు దాటుతున్న వ్యవస్థలో
ఆధిక్యత దేనిదని ఆరా తీస్తున్నాననే దానివి!

ఇప్పుడు నీ సుకుమారమైన వేళ్ల ఏ వజ్రపు టుంగరాన్ని పట్టుకొని మంటపం చుట్టూ తిరుగుతున్నాయో? ఆ అగ్నిని చూస్తే నేను గుర్తుకు రానా?

ఈ చిరిగిన చాపా, విరిగిన కుర్చీ... రెక్క విరిగిన ఫ్యానూ... బరువును పెంచుకున్నపుస్తకాలు... మసిబట్టిన గోడ, కృష్ణుడూ... ఇవన్నీచూసి ఏమనే దానివి? మీ దరి(దాన్ని బట్టి మీరు కవై వుండాలని. ఖాళీ సిగరెట్టు పెట్టెల్ని చూడు.... is the Injurious to Health. రోజంతా నీ ఉత్తరాల దగ్గరికి చెదపురుగులు రాకుండాకాపలాకాస్తున్నాను.




## CURTEN

పీటల మీద మీరెందుకు తలొంచుకొని కూచుంటారు అంటే ఆ రోజెంత పడీపడీ నవ్వావు. నీ నవ్వెంత నిర్మలమైందో? ఆ వెన్నెల సొనల్లో నేను తడుస్తున్నప్పుడు నువ్వెంతటి దారుణమైన(?) జవాబిచ్చావ్. "మీరంతా స్కూటర్లు, టీవీలు, బీరువాలు, ఫ్రిజ్‌లు ఆ మూడుముళ్ళల్లో కుక్కి కట్లు వేస్తుంటే మా మెడలు వంగిపోవూ'' అని.

ఇప్పుడు నువ్వు కూడా (కుంగిపోయి కూచున్నావా... ఏమో??

నా (పాణంలా కొట్టుకుంటున్న ఎల్క్ట్రానిక్ వాచీలో నీ ముహూర్తం లెక్కిస్తుంటే... దగ్గరపడ్డ కొద్దీ ఆ ముడుల్లో నా మెడ చిక్కి ఊపిరి సలుపనట్టుగా వుంది. గోడమీద చూడు.

శిక్షాప(తం...
నేనే అంటించాను. దేవరకొండ బాలగంగాధర తిలక్ రాసింది కాదు. నే గదికొచ్చేసరికి నువ్వు పడేసి పోయింది. ఎంత అందంగావుంది. నువ్వెక్కడో అందని తీరాలకు ఎగిరిపోతే నేను డైరీ పేజీల్లో దాక్కుంటాను. నువ్వు పడేసిపోయిన శిక్షాప(తంలోని శ్లోకం ఇంకా నా మెదడును తొలిచేస్తోంది.

**ఆదిత్యాది (గహాస్సర్వే స్వనక్ష(తా స్వరాశయః**
**కుర్వంతు మంగళం తాభ్యం యయో**
**రుద్వాహ ప(త్రికా!**

## MEMORIES

పైభాగాన ఎంతటి అలలు ఎగిసిపడితే సము(దపు అట్టడుగు అగాధాలకు చలనం కలుగుతుంది? భౌతిక ధర్మాలకు వ్యతిరేకంగా చలనమంతా అడుగునా... నిశ్శబ్దమంతా ఉపరిభాగాన వుంది. నీ తలపుల్లో.

దాన్ని మోసుకుంటూ ఎన్ని సాయం(తాల్లో ఆ తోవ వెంబడి నడిచాను. ఇంకా నీ పాదము(దలు కన్పిస్తాయని... పోస్ట్‌మాన్ ఎదురొచ్చేవాడు... ఏడీ? ఒక్కసారైనా నిన్ను మోసుకురాడే? ఈ లోకంలో ఎవరేమీ తేలేకపోయినా వాడేదో తెస్తాడని కళ్ళని పెకలించి గుమ్మానికి ఉరి తీసానెప్పుడో? సైకిల్ బెల్ నొక్కటం తప్ప నీ గుండె చప్పుళ్ళు విన్పించదు. నీ బాసలేవీ చెప్పిపోదు. వాడంతే....

ఒక్కసారి నిన్ను గొంతెత్తి పిలవాలని వుంది. కాని నా నాలుక మీద నిశ్శబ్ద శాసనాల్ని చెక్కిపోయావు... నా చెక్కిలి మీద కన్నీటిశిలాజాల్ని సృష్టించిపోయావు.

నాకింకా గుర్తు—

రెండేళ్ల క్రితం తుఫాన్‌లా గదికొచ్చి మొదటిసారిగా ప్రేమలేఖ రాశాను... విన్పించమంటావా నన్నావ్. నీ సాంగత్యంలో జ్ఞాపకాల అక్షరాల్ని ఏరుకునే నా గురించి తప్ప ఎవరికి రాసుంటావ్. చదవమన్నాను.

**My Lovely,**

**I Cannot help remembering you every moment of life. I was in search of you for So many Centuries through I was fee ling your influence with out proper know ledge of your all the while.**

**My love for you intensified when you came smiling before me in all your beau ty and splendour some centuries ago.**

**My darling. My love, My Sweety, Oth er wise I'll have to lose my life at your feet.**

**I can hope to live with out you...**

వాకది సరిగా అర్థంగాకపోయినా శతాబ్దాల తరబడి నాకోసం శోధించి, నేను లేని క్షణం నువ్వు లేవనే ఏవో అర్థాలు స్ఫురించి, నేను విజయగర్వంతో చూస్తే నువ్వెంతసేపు నవ్వావు.

"ఇంతకిది ఎవరికని అడగవేం?

వాక్కాదా???

కాదు... రాసిన వారి అడ్రస్ చెప్పనా... విను

**Dear Oxygen...**
**Atosphearic street**
**Nature Nagar**. అని చెప్పి మరెంతసేపునవ్వావు. నవ్వలేని—అలాగని ఏడ్వలేని నన్ను చూసి 'ఫెడరికో ఫెల్లినీ' సిన్మాలో పోరగాడి కథ చెప్పావ్ గుర్తుందా.


ఎన్ని కథలు...

వెన్నెలాడా తెగి పిన్ను గుచ్చి నేనేడిస్తే... నీ నోట్లోని ఉమ్మితీసి నాపాదాలకి రాసి "తూతూ మంత్రం.... తుమ్మకాయ మంత్రం" అంటూ ఎంతగా ఏడిపించావని.

క్షణాలు వేదమంత్రాల మధ్య... నిర్వేదమై నువ్వు!!

"క్షమాపే" అంటే క్షణానికి అర్థం వెతుకుతూనే వున్నా. నే జవాబు చెప్పలేని నీ ఆఖరి ప్రశ్న.. ఎన్ని ప్రశ్నలతో వేధించేదానివి... నువ్వే ఒక ప్రశ్నగా మిగిలిపోయావ్

నాకేదీ చేతకాదంటూ నీ కనురెప్పల వెంట్రుకల్ని లెక్కించమని చెప్పి నా ఒడిలో ఎంతసేపు నిద్రించేదానివి? నేనేమో పెదాలతో ఆడుకొనే



# "DEAR OXYGEN, NATURE NAGAR"

వాణ్ణి. నీ నిశ్వాస నా ఉచ్ఛ్వాసమై గుండె గదుల్లో నిండిపోయేది.. అగరొత్తి పొగలా...

నిన్న పుస్తకంలోంచి నీ ఫోటో రాలిపడింది. నాకెందుకో "అమ్మ" గుర్తుకొచ్చింది. గోర్కీనైపోలేదు. నాన్న రాసిన ఉత్తరం తీసి చదివాను. "పుట్టేముందు రక్తాన్ని పంచిచ్చాం. మేం గిట్టేముందు ఆస్తిని కూడా పంచివ్వాలి కదా. నీ ముందు వాళ్లు సమాంతర రేఖలు గీశారు. మీ అమ్మా, నేనూ దారిద్ర్య రేఖకు అడ్డదారి వెతుక్కొని వెళ్లేముందు నువ్వొక్కసారి వచ్చివెళ్తే మంచిది" మొదటిసారి ఏడ్చాను. నాన్న రాసిన నాలుగు లైన్లలో ఇంట్లో ఏం జరుగుతుందో ఊహించగలను!

అన్నీ మర్చిపోవాలనే నీ జ్ఞాపకాల్ని త్రాగుతాను. చేదుగా మారినా మత్తుగా వుంటాయి.

86... జనవరిలో అనుకుంటూ...

మొదటిసారి మీ ఇంటికొచ్చాను. పట్టరాని ఆనందంతో నువ్వు నా నోట్లో స్వీట్లు కుక్కినప్పుడు మీ మూడేళ్ల తమ్ముడు మీ అమ్మకెళ్లి బుడిబుడి మాటల్తో ఆ విషయం చెప్పితే ఎంత భయపడ్డాం. తర్వాతది మననం చేస్తూ గంటల తరబడి నవ్వేవాళ్లం.


మీ వాళ్లందర్నీ పరిచయం చేస్తూ... ఈ మనుషుల గురించి ఎంత చెప్పేదానివి. శనివారం మడిలో వుండి ఆదివారం మటన్ తెచ్చుకోవటమే వాళ్లకు చేతనవుతుంది—ఆకాశం అంచున పొదిగే. ఇంద్రధనస్సుల మీద జారటం తెలీదు.

అల్యూమినియం పాత్రల్ని అరగతీయటం తప్ప కోయిల కుహూ నాదాలు, వెన్నెల రాలిపడే చప్పుళ్ల వాళ్లకు విన్పించవు.

గంటన్నరసేపు కోల్గేట్ నురగను మింగటం తప్ప—ఆ ఉదయాన కొండశిలల్ని ఢీకొనే అలల దృశ్యాలు వీళ్లెరుగరు. రొచ్చుల గుంటల్లో పడి దోమల్ని చంపటం తప్ప సాయం సంధ్యల్లో రాలిపడే కిరణాల్ని పట్టుకోలేరు. దేవుడు మనిద్దర్నీ మట్టితో చేస్తే వీళ్లని ప్లాస్టిక్‌తో చేశాడు. అంతా కృత్రిమత్వం.... మట్టి వాసన రాని మనుషులు అనేదానివి.

ఆ నత్తగుల్లల మధ్య చేపపిల్లలా నువ్వు...

నువ్వు చిదిమిపెట్టిన జ్ఞాపకాలు ఆకలి కేకల్ని కూడా అదిమిపట్టుతున్నాయి. రారమ్మనే నీ కేకలు ప్రతిధ్వనిస్తూంటే చెరువు గట్టున పడి రోజూ పరిగెడుతుంటాను. కాళ్లు పీకి... కళ్లు తేలిపోయేలోగా ఆ రాతిబండ వద్ద కూలబడి మనిద్దరి పేర్లూ చెక్కివస్తుంటాను ప్రకృతి సాక్షిగా...



## MANGALYAM TANTU NANE-NA

ముడులు...

తడారిన ఎడారి కళ్లక్రింద ఎన్ని సుడులు తిరిగి వుంటాయో? ఒక గోపురానికి సామ్రాజ్ఞివి.

శిక్షాసత్రంలోకి కాలం త్రోయబడింది... నిర్దాక్షిణ్యంగా. మనం తడిసిన చినుకులు గుర్తురావట్లేదా? మోచేతుల్లోకి బలాన్నంతా కూడతీసుకొని వాళ్ల విసుర్తున్న తేళ్లు నీ పట్టుచీరెలో చిక్కుకున్నా... జెర్రులు నీ కురుల్లో కూరుకుపోయినా నువ్వు చలించవు. ఇప్పుడొక కార్యేషు దాసివి... కరుణేషు మంత్రివి.

## KANYA DANAM

నాకు గుర్తొస్తూంది..

ఆ దృశ్యం ఒక సినిమాలో చూస్తూ అల్లరిగా నువ్వు అరవలేదా? ''మీ అల్లుడి పాదాలు లక్స్ సబ్బుతోనే కడగండి'' ప్రేక్షకులంతా నీ వైపు చూస్తుంటే నేనే ప్రేక్షకుణ్ణి అయ్యాను.

పాదాలు.. ఇలలోని నాట్యవేదాలు..

రాతిబండ మీద కూచొని కడలిలోకి కాళ్ళ జాపి పట్టె గొలుసుల చప్పుళ్లన్ని పలికిస్తుంటే నీ పాదాలపై నీళ్ళ చిలకరించి నా నాలుకతో ఆ బిందువుల్ని తాకడంలో ఎంతటి అనుభూతి...

ఎవ్వరికీ దొరకని ఆలంబన...

కడలి కూడా గుప్తంగా గుర్తుంచుకునే ఏకాంతం...




## CONCLUSION

నువ్వు కూడా ఏనాడూ అంతగా అల్లుకుపోలేదు.

నేడు నా శరీరం మీద తీగలల్లుకుపోయిన చెయిన్ దెబ్బలు.

ఈ గదిలో... ఈ గాయాల్తో...

నువ్వనే దానివి—

''పెళ్లి నాటికి ఎన్ని లక్షల గ్యాలన్ల కన్నీళ్లు నిల్వ చేసుకోవాలి? మీ ఇంటికి వచ్చేముందు మా వాళ్లని పట్టుకొని ఏడ్వాలి కదూ...?''

నువ్విప్పుడు ఏ స్థితిలో వున్నావో... కాని...

చూడు

చూడు

చూడు

కళ్లలోని సూర్యుడు భూగోళమై జారిపడతున్నాడు... చెక్కిలి పైకి.

ఈ చరిత్రలో ప్రేమలకింకా స్థానం వుందా అనే ఆశ్చర్యార్థకంలా...

ఆకాశపుటంచులు దాటి పాతాళపు లోతుల్లో పారుతోన్న ప్రవాహంలా...

**నీ తలపైన పడే ఆఖరి అక్షింతంలా...**

**నీ ఏడడుగుల కిందబడే ఒంటరి నక్షత్రంలా...**

**(ఒక దగ్ధ ప్రేమికుడి స్వగతం)**

